బండారి లక్ష్మారెడ్డి గెలుపు ఖాయం

- రాష్ట్రంలో మూడోసారి బీఆర్‌ఎస్సే..
- మంత్రి కేటీఆర్



బూత్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

మల్లాపూర్: ఉప్పల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి గెలుపు వంద శాతం ఖాయమైందని మంత్రి కేటీఆర్ అన్నారు. మల్లాపూర్ వీఎస్‌ఆర్ గార్డెన్‌లో ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన గురువారం ఉప్పల్ నియోజకవర్గం బూత్ కమిటీ సభ్యుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మంత్రి కేటీఆర్ హాజరై మాట్లాడారు. తొమ్మిదిన్నర ఏళ్లలో తెలంగాణ రాష్ట్రం ఎంతగానో అభివృద్ధి చెందిందన్నారు. విశ్వనగరంగా అభివృద్ధి చెందిందని పలువురు బాలీవుడ్ నటులు కితాబు ఇస్తున్నారని తెలిపారు. గతంలో 14 రోజులకు ఒకసారి తాగడానికి నీరు వచ్చేందని, తెలంగాణ రాష్ట్రం వచ్చాక తాగునీరు, కరెంట్ సమస్యలు లేవన్నారు. యూపీలో ముస్లిం ఇళ్లను బుల్డోజర్‌తో కూలగొడుతున్నారు. అదే మతకలహాలు లేకుండా హైదరాబాద్ ప్రశాంతంగా ఉందన్నారు. ఉప్పల్ నియోజకవర్గంలో మినీశిల్పారామం, రోడ్లు, స్కైవాక్ వంటి అభివృద్ధి పనులను ప్రారంభించుకున్నామని, రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చేసుకుందామని తెలిపారు.

కేసీఆర్ పనితీరుకు నిదర్శనం 35 ఫ్లైఓవర్లు..

తెలంగాణ ప్రభుత్వం, కేసీఆర్ పనితీరుకు నిదర్శనం హైదరాబాద్ నగరంలో 35 ఫ్లైఓవర్లు నిర్మాణం అని చెప్పవచ్చు అన్నారు. బీజేపీ ప్రభుత్వం, మోదీ రెండు ఫ్లైఓవర్లు కూడా నిర్మించలేక చేతగాని దద్దమ్మలా ఉండిపోతున్నారని ఎద్దేవా చేశారు. ఐటీతో సంపద సృష్టించబడుతుందని ప్రస్తుతం 10 లక్షల ఉద్యోగాల కల్పన జరిగింది.

భారీ మెజార్టీతో..

కాంగ్రెస్ హయంలో అన్నీ స్కామ్‌లే అన్నారు. మరోసారి బీఆర్‌ఎస్ కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. బూత్ కమిటీ సభ్యులు క్రియాశీలకంగా పనిచేయాలి, ఎన్నికల మ్యానిఫెస్టోను గడప గడపకూ తీసుకెళ్లి ప్రచారం చేయాలన్నారు. 25 రోజులు పని చేయండి మీ కోసం 5 ఏళ్లు బండారి లక్ష్మారెడ్డి పని చేస్తాడన్నారు.

24 గంటలు అందుబాటులో ఉంటా..

తనను ఆశీర్వందించి గెలిపిస్తే మీ అందర్నీ కడుపులో పెట్టుకొని చాదుకుంటానన్ని ఉప్పల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి అన్నారు. తొమ్మిదిన్నర ఏళ్లలో ఉప్పల్ నియోజకవర్గంలో రూ.2,500 కోట్లతో అభివృద్ధి చెందిందన్నారు. తనను గెలిపిస్తే 24 గంటలు అందుబాటులో ఉంటానన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పన్నాల దేవేందర్‌రెడ్డి, శాంతి సాయిజెన్‌శేఖర్, బొంతు శ్రీదేవి, బన్నాల గీతా ప్రవీణ్, ప్రభుదాస్, స్వర్ణరాజ్, సింగిరెడ్డి శిరీషా సోమశేఖర్‌రెడ్డి, తాడురి శ్రీనివాస్, రాగిడి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ బీజేపీ అభ్యర్థి ప్రొఫైల్



పూర్తి పేరు: ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్
జననం: 13 ఏప్రిల్ 1966 తెలంగాణ నివాసం. నెహ్రూనగర్, రామంతాపూర్, ఉప్పల్ నియోజకవర్గం. విద్య : బీటెక్ (సివిల్)

- ప్రభాకర్ 2014 సంవత్సరంలో జరిగిన తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా ఉప్పల్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి తొలిసారి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. అనంతరం 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఇదే నియోజకవర్గంలో నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. బీజేపీలో ఆయన మేనిఫెస్టో కమిటీ చైర్మన్‌గా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వివిధ హోదాల్లో పని చేసి ప్రస్తుతం రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షులుగా ఉన్నారు.
- ఉప్పల్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ పేరు ఖరారైంది. గురువారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి 35 మంది అభ్యర్థులతో ప్రకటించిన థర్డ్ లిస్టులో ప్రభాకర్‌కు అవకాశం కల్పించారు.

రెచ్చగొడితే అందరి బండారం బయటపెడతా..

- హరీశ్‌రావు అక్రమంగా రూ.కోట్లు కూడబెట్టారు
- ఏ అర్హత ఉందని మల్లారెడ్డి మంత్రి అయ్యాడు
- మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు


సమావేశంలో మాట్లాడుతున్న మైనంపల్లి హన్మంతరావు

మల్కాజిగిరి: తెలంగాణ ప్రభుత్వంలో ప్రజల సొమ్ము దుర్వినియోగమైందని, కాళేశ్వరం, అన్నారం బ్యారేజ్, కరీంనగర్‌లో కేబుల్ బ్రిడ్జి దెబ్బతినడం వంటి ఘటనలే అందుకు నిదర్శనమని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు విమర్శించారు. ఆనంద్‌బాగ్‌లో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తనను రెచ్చగొడితే బీఆర్‌ఎస్ నేతల బండారాలన్నీ బయటపెడతానని హెచ్చరించారు. నగరంలో నాలుగున్నర లక్షల మంది డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు దరఖాస్తు చేసుకుంటే ఎంతమందికి ఇచ్చారని ప్రశ్నించారు. జహీరాబాద్‌లో ఐటీఐ చదివిన మంత్రి హరీశ్ రావు నేడు కోట్ల రూపాయలను అక్రమంగా కూడబెట్టారని ఆరోపించారు. ఇసుక దందాలో లక్షల కోట్ల రూపాయలు దోచుకున్నారని, మెదక్ నియోజకవర్గం పరిధిలోని సర్దెన గ్రామంలో రూ.500 కోట్ల ఇసుక దందా చేశారని విమర్శించారు.

మల్లారెడ్డి మంత్రి ఎలా అయ్యారు?

చదువురాని బఫూన్ మల్లారెడ్డి మంత్రి ఎలా అయ్యారో అందరికీ తెలుసని అన్నారు. డబ్బులు తీసుకొని మంత్రి పదవి ఇచ్చారని, లేకపోతే ఏ అర్హత ఉందని మల్లారెడ్డికి మంత్రి పదవి వచ్చిందని గుర్తు చేశారు. తాను తిరుపతి దర్శనానికి వెళ్లిన సమయంలో మల్లారెడ్డి తనపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, లిఫ్ట్ ప్రమాదంలో కాలు విరిగినా ప్రజల కోసం తిరిగి పనిచేశానని, దాన్ని కూడా మంత్రి ఎగతాళి చేయడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓడిపోవడం ఖాయమన్నారు. మల్కాజిగిరిలో జరిగిన అభివృద్ధిని, పనిచేసే వారిని చూసి ఓటు వేయాలని కోరుతున్నానన్నారు.

కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు నమ్మరు!

- ఈ ఎన్నికల్లో దోపిడీ దొంగలకు గుణపాఠం చెప్పండి
- రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీష్‌రావు



మల్కాజిగిరి ఆత్మీయ సమ్మేళన సభలో మట్లాడుతున్న మంత్రి హరీష్‌రావు

గౌతంనగర్: పేదల సంక్షేమానికి అహర్నిషలు శ్రమిస్తున్న కేసీఆర్ సర్కార్‌కే ప్రజలు ముచ్చటగా మూడోసారి పట్టం కట్టను న్నారని రాష్ట్ర ఆర్థిక శాఖ మ్రంతి తన్నీరు హరీష్‌రావు పేర్కొన్నారు. గ్లోబల్ ప్రచారం చేస్తూ.. బీఆర్‌ఎస్ సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై విషం కక్కుతున్న కాంగ్రెస్, బీజేపీని ప్రజలు విశ్వసించడంలేదని మంత్రి స్పష్టం చేశారు. ఈ ఎన్నికలో్ల దోపిడీ దొంగలకు బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ ఎన్నికలు మంచికి చెడుకు మధ్య జరుగుతున్నాయని, చెడుపై ఎప్పటికీ మంచి గెలుస్తుందని, చివరికి ధర్మమే నిలబడుతుందని మంత్రి పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ 75 నుంచి 80 సీట్లు గెలుస్తుందని అన్ని సర్వేలు చెబుతున్నట్లు ఆయన అభిప్రాయపడ్డారు. గురువారం మల్కాజిగిరిలో నిర్వహించిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళన సభలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ దొరల తెలంగాణ అని రాహుల్‌గాంధీ విమర్శలు చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. కేసీఆర్‌లో దొరతనం లేదని, ప్రేమ, దయా గుణాలతో తెలంగాణ ప్రజలను ఇంటి యజమానిగా కంటికి రెప్పలా రక్షించుకుంటున్నాడని అన్నారు. 9 ఏళ్ల కేసీఆర్ పాలనతో కరువు, కర్ఫ్యూ రహిత తెలంగాణగా రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడరని వివరించారు.

సంపద పెంచి.. పేదలకు పంచాలనే లక్ష్యం..

బీఆర్‌ఎస్ పాలనలో తాగునీటి, కరెంట్ కష్టాలను పూర్తిస్థాయిలో తీర్చామన్నారు. కర్ణాటకలో మాదిరి 5గంటల కరెంట్ ఇవ్వడం లేదనే విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. గ్యాస్ సిలిండర్ ధరను రూ.వెయ్యికి పెంచిందని, అధికారంలోకి రాగానే రూ.400లకే పంపిణీ చేయాలని కేసీఆర్ నిర్ణయించినట్లు తెలిపారు. ఆసరా పింఛన్‌ను రూ.2 వేల నుంచి రూ.5 వేలకు పెంచనున్నట్టు చెప్పారు. సౌభాగ్య లక్ష్మి కొత్త పథకంతో ప్రతినెలా ఆడపడుచులకు రూ.3 వేలను వారి బ్యాంక్ ఖాతాలో జమ కానున్నట్లు మంత్రి తెలిపారు. సంపద పెంచి.. పేదలకు పంచాలనే లక్ష్యంతో ముందుకుసాగుతున్న కేసీఆర్ సర్కార్‌ను మరోసారి ఆదరించాలని కోరారు. మైనంపల్లి హన్మంతరావు కొడుకుకు టికెట్ ఇవ్వకపోవడంతో పార్టీపై విమర్శలు చేసి, తన స్వార్థం కోసం ఆయన కాంగ్రెస్ గూటికి చేరినట్లు విమర్శించారు. బీఆర్‌ఎస్ అన్ని చేసినా 'అతి'గా చేసుకున్న మైనంపల్లికి మెదక్, మల్కాజిగిరిలో ఓటమి తప్పదని అన్నారు. ఎంపీగా గెలిచి నాలుగేళ్లు అవుతున్నా రేవంత్‌రెడ్డి మల్కాజిగిరి అభివృద్ధిని ఏనాడూ పట్టించుకోలేదని విమర్శించారు.

నా అంత దమ్ము ధైర్యం లేదు

మంత్రి మలారెడ్డి మట్లాడుతూ మైనంపల్లి హన్మంతరావు నాయకులు, కార్పొరేటర్లను భయపెట్టి పాలన చేశాడని విమర్శించారు. ముగ్గురు పట్టుకుంటే కానీ నడవలేని మైనంపల్లికి నా అంత దమ్ము ధైర్యం లేదని వ్యంగ్యంగా విమర్శించారు. సభలో బీఆర్‌ఎస్ మల్కాజిగిరి అభ్యర్థి మర్రి రాజశేఖరరెడ్డి, జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎంబీసీ చైర్మన్ నందికంటి శ్రీధర్, కార్పొరేటర్లు మేకల సునీతారాముయాదవ్, చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి, మీనాఉపేందర్‌రెడ్డి, సబితకిషోర్, ఏకే మురిగేశ్‌నాయకులు, మల్కాజిగిరి సర్కిల్ ఇన్‌చార్జి జితేందర్‌రెడ్డి, బద్దం పరశురాంరెడ్డి, వెంకన్న, రాముయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల సదస్సు

ఉప్పల్: ఉప్పల్ విద్యుత్ సూపరింటెండెంట్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి విద్యుత్ వినియోగదారుల సదస్సు ఉంటుందని విద్యుత్ అధికారులు తెలిపారు. హబ్సిగూడ డివిజన్ పరిధిలోని ఉప్పల్, రామంతాపూర్, బోడుప్పల్, చిలుకానగర్, ఉప్పల్ భగాయత్, నాచారం, మల్లాపూర్, హబ్సిగూడ సెక్షన్ల పరిధిలో వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు వినియోగదారుల సదుస్సు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. వినియోగదారులకు ఉన్న విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి సమస్యలను పరిష్కరించుకోవాల్సిందిగా వారు కోరారు.

వినియోగదారుల ఆదరణ పొందాలి


కార్యాలయాన్ని ప్రారంభిస్తూ..

రామంతాపూర్: డివిజన్ పరిధిలోని గాంధీనగర్‌లో గురువారం రామంతాపూర్ చికెన్ విక్రయదారుల సంఘం కార్యాలయాన్ని సంఘం అధ్యక్షుడు వరుణ్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చికెన్ షాపుల ఆవరణను ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచి ఖచ్చితమైన తూకంతో నాణ్యమైన చికెన్ విక్రయించి వినియోగదారుల ఆదరణ పొందాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు జాకీర్, అనంతరెడ్డి, చంద్రారెడ్డి, మధుకర్‌రెడ్డి, నరేష్, సోమన్న, రవీందర్‌రెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సాయి హన్సికకు గోల్డ్ మెడల్



గౌతంనగర్: గత నెల 26 నుంచి 31వ తేదీ వరకు ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఆగ్రాలో జరిగిన వరల్డ్ క్రాస్ బౌ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో సాయి హన్సిక చక్రత్ అండర్–18 స్టాండర్డ్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించింది. ఇండియన్ క్రాస్ బౌ షూటింగ్ ప్రెసిడెంట్ రజత విజ్, వైస్ ప్రెసిడెంట్ హిన విజ్ ఈ పోటీలను నిర్వహించారు. ఇందులో ఏడు దేశాలకు చెందిన వారు పాల్గొన్నారు. ఇండియా నుంచి 5 రాష్ట్రాల క్రీడాకారులు పాల్గొనగా మొత్తం 38 పతకాలు వచ్చాయి. సాయి హన్సిక చక్రత్ మల్కాగిరిలోని సెయింట్ మార్టిన్ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతోంది.

మల్కాజిగిరిలో నామినేషన్లకు సర్వం సిద్ధం

మల్కాజిగిరి: ఎన్నికల రంగంలో కీలక ఘట్టమైన నామినేషన్ల పర్వం శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ కార్యాలయాన్ని మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. జోనల్ కమిషనర్ ఎన్.రవికిరణ్ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించనున్నారు.

- ఈ నెల 3వ తేదీ నుంచి 10వ తేదీ వరకు (ఆదివారం మినహాయించి) ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. అదే సమయంలో ఆన్‌లైన్ ద్వారా నామినేషన్లు దాఖలు చేయవచ్చు.
- నామినేషన్ల పరిశీలన ఈ నెల 13వ తేదీ జరుగుతుంది. ఉపసంహరణకు గడువు 15వ తేదీతో ముగుస్తుంది.
- నామినేషన్ దాఖలు చేసే వ్యక్తితో పాటు నలుగురిని మాత్రమే లోనికి అనుమతిస్తారు.
- పోలీస్ విభాగం నుంచి సర్కిల్ కార్యాలయం పరిసరాల్లో 144 సెక్షన్ అమలుతో పాటు సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేశారు.
- సర్కిల్ కార్యాలయానికి పనుల నిమిత్తం వచ్చే ప్రజలు మధ్యాహ్నం 3 తర్వాత రావాలని పోలీసు అధికారులు కోరారు.
- సర్కిల్ కార్యాలయం చుట్టూ బ్యారికేడ్లు ఏర్పాటు చేశారు.

నిబంధనలు పాటించాలి



నానినేషన్ల కార్యక్రమం సజావుగా జరగడానికి రాజకీయ పార్టీ నాయకులు, అభ్యర్థులు సహకరించాలని, నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని రిటర్నింగ్ అధికారి రవికిరణ్ సూచించారు. ప్రతి రోజు గడువు సమయం ముగిసిన తర్వాత నానినేషన్లను స్వీకరించమని, గడువు లోపు కార్యాలయంలో ఉన్న వారికి అనుమతిస్తామన్నారు.
– రవికిరణ్, రిటర్నింగ్ అధికారి

ఆర్‌వో కార్యాలయ పరిసరాల్లో 144 సెక్షన్

ఉప్పల్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థుల నామినేషన్ ప్రక్రియ శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లను స్వీకరించనున్నట్లు ఆర్‌వో అభిషేక్ అగస్త్య తెలిపారు. అభ్యర్థి వెంట కేవలం నలుగురు వ్యక్తులకు మాత్రమే అనుమతి ఉంటుందని తెలిపారు. నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కావడంతో గురువారం నుంచి ఆర్‌వో కార్యాలయ పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని అధికారులు తెలిపారు.

వాటర్ మెన్ మృతి


స్వామి(ఫైల్)

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో వాటర్ మెన్ నల్లాల స్వామి(53) గుండె పోటుతో మృతి చెందాడు. బోడుప్పల్ ఎస్సీ బస్తీలో నివసించే స్వామి కొంత కాలంగా నగర పాలక సంస్థలో పని చేస్తున్నాడు. అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో వారం రోజులుగా విధులకు హాజరు కావడం లేదు. చికిత్స పొందుతుండగా మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందినట్లు వారి కుటుంబ సభ్యులు వెల్లడించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మేడిపల్లి: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. బోడుప్పల్ కట్ట మైసమ్మ వైన్స్ సమీపంలోని స్థలంలో సుమారు 50 నుంచి 55 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి మృతదేహం పడి ఉన్న విషయాన్ని స్థానికులు మేడిపల్లి పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం పోలీసులు మృతదేహాన్ని పరిశీలించగా అతడు బిచ్చగాడి మాదిరిగా కనిపించాడని, అతడి చేతిమీద పచ్చబొట్టు ఉన్నట్లు మేడిపల్లి పోలీసులు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

అల్వాల్: గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచారం నిర్వహిస్తున్న జంటను అల్వాల్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటాపురం మారుతినగర్‌లో నివాసముండే వెంకటేశ్వర్లు(35) దంపతులు. ఆరు నెలల నుంచి ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు గురువారం ఇంట్లో దాడి చేసి ఇద్దరు మహిళలు, ఒకరు విటుడిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.2,700లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధిని చూసి ఓటెయ్యాలి


ఇంటింటి ప్రచారంలో హేమలతారెడ్డి

బోడుప్పల్: బీఆర్‌ఎస్ హయాంలో చేసిన అభివృద్ధిని చూసి ఓటెయ్యాలని 18వ డివిజన్ కార్పొరేటర్ పులకండ్ల హేమలతారెడ్డి అన్నారు. 18వ డివిజన్ శ్రీనగర్‌కాలనీ, విజయపురి కాలనీల్లో గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో మంత్రి చామకూర మల్లారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆమె ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేతలు పులకండ్ల జంగారెడ్డి, ప్రమోద్‌కుమార్ కాలనీవాసులు పాల్గొన్నారు.

ఇన్ఫోసిస్‌ను సందర్శించిన 'అనురాగ్' విద్యార్థులు

ఘట్‌కేసర్: పారిశ్రామిక సందర్శనలో భాగంగా వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ ఏఐ, ఏఐఎంఎల్ రెండో సంవత్సరం విద్యార్థులు గురువారం పోచారం మున్సిపాలిటీ ఇన్ఫోసిస్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఐటీ పరిశ్రమ స్థాపన, నిర్వాహణ గురించి ఇన్ఫోసిస్ శిక్షణ అధికారిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఓడీ మల్లికార్జున రెడ్డి, రిజిస్ట్రార్ బాలాజీ, వైస్ చాన్సలర్ రామచంద్రం, సీఈఓ సీలిమా, ఏఐ అధ్యాపకులు మనోరంజన్, సరళ, రఘు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉప్పల్ కేవీ–1లో జాతీయ స్థాయి పోటీలు


జ్యోతి ప్రజ్వలనలో..

సాక్షి, సిటీబ్యూరో: ఉప్పల్‌లో ఉన్న కేంద్రీయ విద్యాలయ–1 జాతీయ స్థాయి అండర్–17 ఖోఖో పోటీలకు ఆతిథ్యం ఇస్తోంది. ఈ క్రీడోత్సవాలు స్కూలు ప్రాంగణంలో గురువారం ప్రారంభమయ్యాయి. వీటిని ప్రిన్సిపల్ ఈవీ రమణ సమక్షంలో విద్యాలయ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్‌గా ఉన్న సర్వే ఆఫ్ ఇండియా డిప్యూటీ సర్వేయర్ జనరల్ జి.వరుణ్‌కుమార్ ప్రారంభించారు. దేశంలోని వివిధ కేంద్రీయ విద్యాలయాలకు చెందిన 17 ఏళ్లలోపు విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. ఈ క్రీడాకారులతో పాటు వెంట వచ్చిన ఉపాధ్యాయులకు పాఠశాల ఆవరణలోనే బస ఏర్పాటు చేశారు. మొత్తం కేంద్రీయ విద్యాలయ సంఘటన్‌లోని 25 రీజియన్ల నుంచి 350 మంది విద్యార్థులు, 50 మంది టీచర్లు వచ్చారు. సోమవారం వరకు ఈ పోటీలు జరగనున్నాయి. ప్రారంభోత్సవ కార్యక్రమంలో వివిధ కేవీలకు చెందిన ప్రిన్సిపల్స్, పీఈటీలు పాల్గొన్నారు.



డాక్టర్ ఏఎస్‌రావు సేవలు చిరస్మరణీయం



కాప్రా: డాక్టర్ ఏఎస్‌రావునగర్ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈసీఐఎల్ వ్యవస్థాపకుడు, శాస్త్రవేత్త డాక్టర్ ఏఎస్‌రావు వర్ధంతిని ఏఎస్‌రావునగర్‌లోని డాక్టర్ హోమీజే బాబా కమ్యూనిటీ హాలులో నిర్వహించారు. ఆయన జీవిత చరిత్ర, బుర్రకథ ప్రదర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఏఎస్‌రావు సేవలను పలువురు వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో తిరుపతయ్య, సుబ్రహ్మణ్యం, శంకర్‌రావు, రాజేంద్రన్, శ్రీనివాస్, ఎంఎస్‌ఎన్.రాజు, విజయ్‌కుమార్, శివకుమార్, రాజేశ్వర్, రామామూర్తి, కృష్ణమూర్తి, ఎస్‌ఎన్.చారి, పీవీపీ మూర్తి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దోచుకోవడమే బీఆర్‌ఎస్ లక్ష్యం

మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



ఘట్‌కేసర్: తెలంగాణలో కుటుంబ పాలన, దోచుకోవడం, దాచుకోవడమే లక్ష్యంగా పాలన సాగుతోందని, ఎమ్మెల్యేలు ఇష్టారాజ్యాంగా వ్యవహరిస్తున్నారని మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని శ్రీవాసవీ కల్యాణ మండపంలో గురువారం ఘట్‌కేసర్ మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరి యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేశ్‌యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉపాధి కల్పించడంలో బీఆర్‌ఎస్ ఘోరంగా విఫలమైందన్నారు. మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి వజ్రేశ్‌యాదవ్ మాట్లాడుతూ రూ.10 కోట్లతో గురుకుల్ ఆవరణలో డిగ్రీ కాలేజీ, స్థానికంగా వైద్యశాలలను ఏర్పాటు చేస్తామన్నారు. మాజీ ఎంపీటీసీలు మహేశ్, రమేశ్, మాజీ ఉప సర్పంచ్ యాదగిరియాదవ్, బీఆర్‌ఎస్ మున్సిపల్ మాజీ ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సత్యప్రసాద్



కాప్రా: ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కాప్రాకు చెందిన టి.సత్యప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఏఐవైఎఫ్ మహాసభలో సత్యప్రసాద్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువు, పోరాడు అనే నినాదంతో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీలేని పోరాటాలు చేశానన్నారు. పదవి బాధ్యతలు అప్పగించిన జాతీయ, రాష్ట్ర, జిల్లా, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్‌కు అభినందనలు



రామంతాపూర్: ఉప్పల్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థిగా ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్‌ను ప్రకటించినందుకు గురువారం రాత్రి కార్పొరేటర్లు బండారు శ్రీవాణి వెంకటరావు చేతన హరీష్ ఆధ్వర్యంలో కార్యకర్తలు, నేతల సమక్షంలో ఆయనను ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.

4,500 కిలోల బెల్లం పట్టివేత

పోచారం: అక్రమంగా తరలిస్తున్న 4,500 కిలోల నల్లబెల్లం ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీసులు, మల్కాజిగిరి టాస్క్‌ఫోర్స్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం పట్టుకున్నారు. సీఐ మల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్నికల నియమావళిలో భాగంగా మేడిపల్లి అపెక్స్ ఆస్పత్రి ఎదురుగా వాహనాలు తనిఖీ చేపట్టగా టీఎస్ 08 యూకే 2288 అశోక్ లీలాండ్ వాహనంలో 4,500 కిలోల బెల్లం లభించింది. డ్రైవర్‌ను విచారించగా బెల్లం సంబంధిచిన కొనుగోలు రసీదులు లేవన్నాడు. దీంతో వాహనం డ్రైవర్, ఓనర్ మేడిపల్లి పీఎన్టీ కాలనీకి చెందిన ఎస్‌కే మంజు, మేడిపల్లి ఎన్‌ఆర్ఎస్‌వీ అనెన్యూకు చెందిన రామభద్రయ్యను ఎక్సైజ్ నియమావళిని అనుసరించి వారిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామన్నారు. స్వాధీనం చేసుకున్న బెల్లం విలువ రూ.22 లక్షలు ఉంటుందన్నారు. సీఐ మలయ్య, డీటీసీఐ భరత్ భూషణ్, ఎస్ఐ పురుషోత్తంరెడ్డి, శ్రావణి, సిబ్బంది పాల్గొన్నారు.